
సాక్షి తిరుపతి

మంగళవారం । 14 । నవంబర్ । 2023



గయాలులో..భూచోళ్లు

శ్రీకాళహస్తి మండలం, వేలవేడు రెవెన్యూ, గంగలపూడి పరిధిలోని గయాలు భూములను టీడీపీ నేతలు ఆక్రమించేశారు. - 8లో



కేదార గౌరీదేవి వ్రతం

శ్రీకాళహస్తీశ్వరాలయంలో కేదారి గౌరీదేవి వ్రతాన్ని సోమవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. - 8లో



పుస్తకావిష్కరణ

చంద్రగిరి, (తిరుచానూరు) కల్పవృక్ష వాహన సేవలో సోమవారం ఉదయం పలు ఆధ్యాత్మిక పుస్తకాలను ఆవిష్కరించారు.

న్యూస్‌రీల్

కోనలో వైభవంగా రథోత్సవం



కోన మాడవీధుల్లో రథంపై ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

రాపూరు: శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో స్వాతి నక్షత్రం, దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రథోత్సవం ఆర్టీసీ బస్టాండు వరకు వెళ్లి అక్కడ ఏర్పాటు చేసిన నరకాసురుని ప్రతిమను స్వామివారి విల్లుతో దహనం చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈఓ జనార్దన్‌రెడ్డి, ప్రధానార్చకులు రామయ్యస్వామి, పెంచలయ్యస్వామి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 6 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 74,807 మంది స్వామివారిని దర్శించుకోగా 21,974 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.58 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 6 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు



వెన్నేటి సూర్య నారాయణమూర్తి

తిరుపతి అర్బన్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ గ్రంథాలయాల్లో మంగళవారం నుంచి 20వ తేదీ వరకు 56వ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్టు తిరుపతి ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయ గెజిటెడ్ అధికారి వెన్నేటి సూర్యనారాయణమూర్తి తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. వారోత్సవాల సందర్భంగా పాఠకులు తీసుకున్న పుస్తకాలకు గడువు దాటినా అదనపు రుసుం చెల్లించాల్సిన అవసరం ఉండదన్నారు. 20వ తేదీ తర్వాత పుస్తకాలు ఇస్తే అదనపు రుసం చెల్లించాలని చెప్పారు.

విజేతలకు బహుమతులు

గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోని గ్రంథాలయాల్లో పలు పోటీలు నిర్వహించడంతోపాటు విజేతలకు బహుమతులు అందిస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ నైనార్ మధుబాల తెలిపారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు వారికి వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించనున్నట్టు వెల్లడించారు.

కార్తీక మాసోత్సవాలు ప్రారంభం



ఆకాశదీపాన్ని వేలాడదీస్తున్న ఎమ్మెల్యే సతీమణి శ్రీవాణి, ఆలయ చైర్మన్ శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం కార్తీక మాసోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. కార్తీక మాసోత్సవాల్లో మొదటిరోజు ఆలయ అర్చకులు ఆకాశదీపాన్ని వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల్లో స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సతీమణి బియ్యపు శ్రీవాణి పాల్గొన్నారు. అనంతరం ఆకాశదీపాన్ని ప్రత్యేక స్తంభానికి పైభాగంలో ఆకాశంవైపుగా వేలాడుతుండేలా ఏర్పాటు చేశారు. ఆలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో సాగర్ బాబు, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు



కల్పవృక్షవాహనంపై రాజమన్నార్‌గా..



సింహ వాహనంపై యోగలక్ష్మిగా..



ముత్యపు పందిరిపై గజేంద్ర వరదుడిగా..



హనుమంత వాహన సేవలో టీటీడీ చైర్మన్ భూమన, ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

హనుమంతుడిపై శ్రీరామచంద్రుడు



సిరుల తల్లికి వందనం


చంద్రగిరి(తిరుచానూరు): శ్రీపద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా నాల్గవ రోజైన సోమవారం రాత్రి అమ్మవారు హనుమంత వాహనంపై శ్రీరామచంద్రమూర్తి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం కల్పవృక్ష వాహనంపై రాజమన్నార్ అలంకరణలో తిరువీధుల్లో విహరిస్తూ కనువిందు చేశారు. ఇదిలావుండగా ఆదివారం ఉదయం అమ్మవారు ముత్యపు పందిరి వాహనంపై, రాత్రి సింహ వాహనాలపై భక్తులను అనుగ్రహించారు. వాహనసేవల్లో పెద్ద జీయర్ స్వామి, చిన్నజీయర్‌స్వామి, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి, ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, టీటీడీ బోర్డు సభ్యులు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, జేఈఓ వీరబ్రహ్మం, ఆలయ డెప్యూటీ ఈవో గోవిందరాజ తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మీకటాక్షం

ఎలక్ట్రిక్ బస్.. రైట్ రైట్

ఇంధన వనరుల తరుగుదల..పర్యావరణ కాలుష్యం నివారణే లక్ష్యంగా ప్రభుత్వం ముందడుగు వేస్తోంది. ఇందుకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి పుంగనూరు అభివృద్ధికి పరిశ్రమలు ఏర్పాటుపై సీఎంతో చర్చించారు. అందుకు ఆయన అంగీకరించి.. జర్మన్‌కు చెందిన పెప్పర్ బస్సుల తయారీ సంస్థ స్థాపనకు ఆమోదించారు. ఆ పరిశ్రమ యాజమాన్యం కూడా ఫ్యాక్టరీ స్థాపనకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.



పుంగనూరులో ఏర్పాటు చేయనున్న పరిశ్రమలో తయారు చేయనున్న పెప్పర్ ఎలక్ట్రికల్ బస్సు



- జర్మన్ పెప్పర్ పరిశ్రమ స్థాపనకు గ్రీన్ సిగ్నల్
- ముఖ్యమంత్రి జగన్‌కు పెప్పర్ కృతజ్ఞతలు
- 29న సీఎంతో సమావేశం
- రూ.5వేల కోట్లతో పెప్పర్ ఎలక్ట్రికల్ బస్సుల తయారీ
- 2027కు మార్కెట్‌లోకి 50 వేల వాహనాలు
- మరో 10 అనుబంధ కంపెనీలు రాక
- పదివేల మంది నిరుద్యోగులకు ఉపాధి
- దేశ వ్యాప్తంగా పుంగనూరుకు గుర్తింపు

పుంగనూరు: పెద్దాయన సొంత నియోజకవర్గమైన పుంగనూరులో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన జర్మన్ పెప్పర్ కంపెనీ ఎలక్ట్రికల్ బస్సుల తయారీ పరిశ్రమ స్థాపనకు తొలిసారిగా ఇక్కడికి రానుండడంతో పుంగనూరు చరిత్రకెక్కనుంది. పుంగనూరులో పరిశ్రమల ఏర్పాటు చేయాలని రాష్ట్రమంత్రి పెద్దిరెడ్డి రా మచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డిలు ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డిని కోరారు. ఇందుకు సీఎం అంగీకరించడంతో గత నెల 30న జరిగిన మంత్రి వర్గ సమావేశంలో ఎలక్ట్రిక్ బస్సుల కంపెనీ పుంగనూరులో ఏర్పాటు కు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కంపెనీ కృతజ్ఞతలు తెలిపింది.

రూ.5 వేల కోట్లతో ఏర్పాటు

జర్మనీలో ఉన్న పెప్పర్ ఎలక్ట్రికల్ బస్సులు, ట్రక్కులు, బ్యాటరీల తయారీ సంస్థ సుమారు రూ.5 వేల కోట్లతో ఇక్కడ ఫ్యాక్టరీ నిర్మించనుంది. పుంగనూరు మండలంలోని ఆరడిగుంట, మేలుందొడ్డితోపాటు పెద్దపంజాణి మండలంలోని కరసనపల్లె రెవెన్యూ గ్రామాల్లో 800 ఎకరాల్లో భూమిని కేటాయించేందుకు మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి అంగీకరించారు. ప్రస్తుతం పరిశ్రమలకు కేటాయించిన రెండు వేల ఎకరాల్లో ఈ పరిశ్రమ ఏర్పాటు కానున్నది. దీని ద్వారా పదివేల మంది నిరుద్యోగులకు ఉపాధి లభించనుంది.

పుంగనూరుకు నీటి లభ్యతతో..

పుంగనూరులో రాష్ట్ర విద్యుత్, భూగర్భ వనరుల శాఖా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డిలు నీటి సమస్య పరిష్కరించేందుకు పుంగనూరు మండలంలోని నే తిగుట్లపల్లె, సోమల మండలంలోని ఆవులపల్లె వద్ద రెండు రిజర్వాయర్లు నిర్మిస్తున్నారు. అలాగే వైఎస్సార్ జిల్లా గండికోట ప్రాజెక్టు నుంచి పైపులైన్ల ద్వారా పుంగనూరుకు నీరు పుష్కలంగా తరలించేందుకు యుద్ధ ప్రాతిపదికన పనులు జరుగుతున్నా యి. దీనికితోడు కర్ణాటక సరిహద్దులోని జాతీయ రహదారులను పుంగనూరుకు అనుసంధానం చే శారు. ఫలితంగా పారిశ్రామిక వేత్తల కళ్లు పుంగనూరుపై పడేలా చేయడంలో ఎంపీ మిథున్‌రెడ్డి వి జయం సాధించారు. ఆయన ఆలోచనలు నేడు కార్యరూపం దాల్చాయి. పారిశ్రామిక వేత్తలు పుంగనూరును అనువైన ప్రాంతంగా ఎంపిక చేసుకుంటున్నారు. ఇప్పటికే శ్రీకాళహస్తికి చెందిన ఫెర్రో ఆలాయ్ పైపుల ఫ్యాక్టరీ పనులు ప్రస్తుతం చురుగ్గా సాగుతున్నాయి.

29న సీఎం చెంతకు ప్రతినిధుల బృందం

పుంగనూరులో ఏర్పాటు చేయనున్న పెప్పర్ ఎలక్ట్రికల్ బస్సుల ఫౌండర్లు క్రిష్టియన్ వాగ్నర్, బ్యాస్టియన్ ఫెడ్రిచ్, సీఈఓ ఆండ్రియస్, సీఐఓ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో 12 మంది బృందం ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని ఈనెల 29న కలసి కంపెనీ ఏర్పాట్లపై చర్చించనున్నారు.

నెలాఖరుకు పుంగనూరుకు..

పుంగనూరుకు పెప్పర్ ఎలక్ట్రికల్ బస్సుల ఫౌండర్లు క్రిష్టియన్ వాగ్నర్, బ్యాస్టియన్‌ఫెడ్రిచ్ తో కూడిన బృందం ఈనెలాఖరులో పుంగనూరులో పర్యటిస్తారని ఎంపీ మిథున్‌రెడ్డి తెలిపారు. కంపెనీ భూసేకరణకు సంబంధించి వివరాలు వెల్లడిస్తారన్నారు. త్వరలోనే కంపెనీ నిర్మాణ పనులను సీఈఓ ఆంద్రియస్, సీఐఓ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతాయని తెలిపారు.

దేశ చరిత్రలో నిలిచిపోతాం


పుంగనూరు మండలం ఆరడిగుంటలో జర్మనీ ఎలక్ట్రికల్ బస్సుల కంపెనీ నెలకొల్పేందుకు ముందుకు రావడం పుంగనూరు ప్రజల అదృష్టమని, దేశ చరిత్రలో పుంగనూరు పేరు నిలిచిపోతుందని పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్ తెలిపారు. సోమవారం ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర జానపదకళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, బోయకొండ ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డితో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి కృషితో పుంగనూరు పారిశ్రామికాభివృద్ధి చెందుతోందన్నారు. 40 ఏళ్లలో జరగని అభివృద్ధిని నాలుగున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంత్రి కుటుంబం చేసి చూపిందన్నారు. ప్రభుత్వానికి ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్మన్ అమరనాథరెడ్డి, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, పార్టీ నాయకులు కొత్తపల్లె చెంగారెడ్డి, చంద్రారెడ్డి యాదవ్, జయరామిరెడ్డి, సుబ్రమణ్యం, రాజేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్. చిత్రంలో మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా

2027నాటికి 50 వేల వాహనాలు

పుంగనూరులో పెప్పర్ ఎలక్ట్రికల్ బస్సుల ఫ్యాక్టరీ ఏర్పాటు చేసి, 2027 సంవత్సరం నాటికి సుమారు 50 వేల బస్సులు, ట్రక్కులతో మార్కెట్‌లోకి విడుదల చేయడానికి కంపెనీ యాజమాన్యం ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇందుకు అవసరమైన సిబ్బంది, ముడిసరుకు ఏర్పాట్లను ఎప్పటికప్పుడు సిద్ధం చేసుకోనున్నట్లు ఆ కంపెనీ ప్రతినిధులు స్పష్టం చేశారు.



పుంగనూరుకు ప్రత్యేక స్థానం



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు కావడంతో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి పుంగనూరుకు ప్రత్యేక స్థానం కల్పించారు. బైపాస్ రోడ్డు, మినీ బైపాస్, ఆర్టీసీ డిపో, వంద పడకల ఆస్పత్రి, ఎంబీటీ రోడ్డు విస్తరణ, పాలిటెక్నికల్ కళాశాల, సబ్‌స్టేషన్లతో పాటు ప్రతి గ్రామానికీ సిమెంటు రో డ్లు, కాలువలు, ఓవర్‌హెడ్ ట్యాంకులు ఏ ర్పాటు చేశారు. నలభైఏళ్లలో జరగని అభివృద్ధిని నాలుగేళ్లలో చేపట్టాం. ప్రజలకు అ న్ని విధాల అండగా ఉంటాం. పుంగనూ రు అభివృద్ధే మా ధ్యేయం.

– రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

జగనన్నతోనే అభివృద్ధి



ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు పాద యాత్రలో ఇచ్చిన హా మీ మేరకు పుంగనూరుకు ప్రత్యేక ని ధులు కేటాయించా రు. అభివృద్ధికి దూరమైన పుంగనూరులో అభివృద్ధి పరుగులు తీస్తోంది. రెండు రిజర్వాయర్లు, గండికోట రిజర్వాయర్ నుంచి పైపులైన్లతో సాగు, తాగునీరుకు లభిస్తుందన్న నమ్మకం ప్రతిఒక్కరిలోనూ ఉంది. దీంతోనే పారిశ్రామికవేత్తల పుంగనూరుకు వస్తున్నారు. పరిశ్రమల ద్వారా నిరుద్యోగ సమస్య పూర్తిగా నిర్మూలించి, పుంగనూరును ప్రత్యేకంగా అభివృద్ధి చేస్తాం. పుంగనూరు అభివృద్ధికి సహకరిస్తున్న జగనన్నకు కృతజ్ఞతలు.

– పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎంపీ, రాజంపేట

అట్టహాసంగా నరకాసుర వధ

2.50 లక్షల టపాసులతో 25 అడుగుల భారీ విగ్రహం

- ఆకట్టుకున్న తారాజువ్వల వెలుగులు
- భారీగా తరలివచ్చిన జనం
- పాల్గొన్న ప్రభుత్వ విప్ చెవిరెడ్డి

తిరుపతి రూరల్: వేలాది మంది భక్తులు కన్నులాగా వీక్షిస్తుండగా లక్షలాది టపాసుల వెలుగులు, భారీ బాంబుల మోతలతో తుమ్మలగుంటలో దీపావళి వేడుకలు అట్టహాసంగా సాగాయి. ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం తుమ్మలగుంట శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో దీపావళి, నరక చతుర్దశి పర్వదినాన్ని పురస్కరించుకొని వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను కళ్లారా తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు.

భారీ ప్రతిమ

2.50 లక్షల టపాసులతో 25 అడుగుల నరకాసుర ప్రతిమను సిద్ధం చేశారు. అందులో లక్షలాది టపాసులతో పాటు మోత ఎక్కువగా వచ్చే బాంబులను కూడా అక్కడక్కడ ఏర్పాటు చేశారు. దీంతో రంగు రంగుల వెలుగుల్లో ఆలయ ప్రాంగణం సరికొత్త శోభను సంతరించుకుంది. ఆదివారం రాత్రి 7.30 గంటలకు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి చేతులు మీదుగా నరకాసుర ప్రతిమకు నిప్పంటించారు. ఆ తర్వాత తారా జువ్వల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. జనసందోహాన్ని దృష్టిలో ఉంచుకుని బారికేడ్లు ఏర్పాట్లు చేశారు. ఆలయ పరిసరాలలో తిరుపతి రూరల్ సీఐ సుబ్రమణ్యంరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



దీపావళి వేడుకల్లో పాల్గొన్న భక్తులు



నరకాసుర ప్రతిమకు పూజలు చేస్తున్న ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

చెడుపైన మంచి విజయానికి నిదర్శనం

పండుగలు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీ రూపకాలని ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పేర్కొన్నారు. చెడుపైన మంచి సాధించిన విజయానికి నిదర్శనం దీపావళి అన్నా రు. ప్రతి ఒక్కరూ తమలోని మంచి మాత్రమే పంచుతూ సాటి వారికి సాయం చేయాలని పిలుపునిచ్చారు.

గయాలులో..'భూ'చోళ్లు!

- పక్కా పథకం ప్రకారమే గంగలపూడిలో గయాలు భూముల ఆక్రమణ
- ఎస్సీ, ఎస్టీల చేతిలో అరకొర నగదు పెట్టి పట్టాలు లాక్కున్న టీడీపీ శ్రేణులు
- 25 ఎకరాల గోపాలాన్నీ వదలని మాయగాళ్లు
- కొనరాదు, అమ్మరాదు అనే నిబంధనకు తూట్లు
- ఆ 900 ఎకరాల్లో ఇప్పటికీ ఆగని టీడీపీ నేతల దౌర్జన్యాలు

సాక్షి, తిరుపతి:పక్కా పథకం ప్రకారమే వేలవేడు పరిధిలోని గంగలపూడి గయాలు భూములను టీడీపీ నేతలు ఆక్రమించుకున్నారు. కోట్ల రూపాయల విలువచేసే ప్రభుత్వ భూములను టీడీపీ నేతలు పప్పు బెల్లాల్లా పంచుకున్నారు. ఆ పంపకాల్లో కొందరికి తక్కువ రావడం, ఆన్‌లైన్‌లో వారి పేర్లు నమోదు కాకపోవడంతో టీడీపీ శ్రేణుల మధ్య వివాదాలు రేగుతున్నాయి. ప్రభుత్వం చుక్కల భూములకు హక్కులు కల్పిస్తుండడంతో ఈ వివాదం తెరపైకి వచ్చింది. శ్రీకాళహస్తి పట్టణానికి 15 కి.మీ దూరంలోని వేలవేడు రెవెన్యూ గంగలపూడి పరిధిలో సుమారు 2వేల ఎకరాలకుపైగా ప్రభుత్వ భూములు ఉన్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో భూ పంపిణీ కింద 900 ఎకరాల వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పంపిణీ చేసినట్లు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ఆ భూములను కొందరు సాగు చేసుకుంటుంటే.. మరి కొందరు బీడుగానే వదిలేశారు. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చాక మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి తన అనుచరులకు ప్రభుత్వ భూములను ఉచితంగా కట్టబెట్టాలని భావించారు. ఆ సమయంలో ప్రభుత్వ భూముల కోసం అన్వేషణ మొదలు పెట్టారు. ఈ అన్వేషణలో పల్లంపేటకు చెందిన టీడీపీ నాయకులు ఇద్దరు కీలకంగా వ్యవహరించారు.

గంగలపూడిలో దొంగలు పడ్డారు!

శ్రీకాళహస్తి, వెంకటగిరి పట్టణానికి మధ్యలోని గంగలపూడి గ్రామంలో పెద్ద ఎత్తున భూములు ఉన్నాయని గుర్తించారు. అయితే అవి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో పంపిణీ చేసిన విషయాన్ని తెలుసుకున్నారు. ఇదే విషయాన్ని బొజ్జల గోపాలకృష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆ గ్రామానికి అటు ఇటు నాలుగులేన్ల రహదారులు, గ్రామం మధ్యన రహదారి వస్తుందని తెలుసుకున్నారు. రాబోవు రోజుల్లో ఆ భూములకు మంచి విలువ ఉంటుందని భావించారు. లబ్ధిదారులను నయానో, భయానో భూముల్లో నుంచి తరిమేయాలని నిర్ణయించారు. బొజ్జల గోపాలకృష్ణారెడ్డి, అప్పటి రెవెన్యూ అధికారుల అండదండలతో రంగంలోకి దిగిన టీడీపీ శ్రేణులు ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఇచ్చిన భూములను లాక్కోవడం మొదలు పెట్టారు. కొందరిని ఒప్పించి ఎకరానికి రూ.10 వేల నుంచి రూ.20వేల చొప్పున చేతిలోపెట్టి పట్టాలు తీసుకున్నారు. మరికొందరిని భయపెట్టి బలవంతంగా పట్టాలు లాక్కున్నారు. ఆ భూములు ఎందుకూ పనికిరావని ఇంకొందరిని నమ్మించారు. రకరకాల మాయలు చేసి పట్టాలు లాక్కున్న తరువాత రెవెన్యూ అధికారుల సహకారంతో ఆన్‌లైన్‌లో వారి పేర్లు, బంధువుల పేర్లు నమోదు చేసుకున్నారు. భూ పంపిణీ కింద ఇచ్చిన భూములను కొనరాదు, అమ్మరాదు అనే నిబంధన ఉన్నా.. కొనుగోలు చేసినట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారు.



భూ పంపిణీ సమయంలో ఇచ్చిన పాసుపుస్తకం

పంపకాల్లో చెలరేగిన వివాదం

ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఇచ్చిన భూములను లాక్కుని పంపిణీలో తేడా రావడంతో ఆక్రమణలు వెలుగులోకి వచ్చాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 20 ఏళ్లుగా అనుభవిస్తున్న ప్రభుత్వ భూములకు పూర్తి హక్కులు కల్పిస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రభుత్వ మార్గదర్శకాలను తమకు అనుకూలంగా మార్చుకునేందుకు టీడీపీ నేతలు రెవెన్యూ అధికారుల సహకారంతో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవడం ప్రారంభించారు. ఎకరాకు కొంత నగదును అధికారులకు ఇచ్చి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారు. ఈ నమోదు ప్రక్రియలో భాగంగా భూములు పంచుకున్న కొందరివి పల్లంపేటకు చెందిన ముఖ్య నాయకుడు తన పేరున, భార్య, పిల్లలు, అత్త, బామర్దులు, తమ్ముళ్ల పేరున నమోదు చేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ విషయాన్ని పల్లంపేటకు చెందిన ఓ మహిళ సాక్షి ప్రతినిధి వద్ద బోరుమంది. ×మా వాడే మాకు మోసం చేశాడు. పంపకాల్లో మాకు కేటాయించిన భూమిని మాకు వచ్చేలా చూడండి× అంటూ ప్రాధేయపడ్డారు.

పశువులను సైతం విక్రయించుకున్నారు

ఇదే గంగలపూడి గ్రామంలో సుమారు 25 ఎకరాల గోపాలం ఉండేది. ఈ భూమిని స్థానిక యాదవ సామాజిక వర్గం వారు పశువుల మేతకు వినియోగించుకునే వారు. అయితే 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చాక ఈ 25 ఎకరాల గోపాలాన్ని సైతం ఆక్రమించుకున్నారు. దీంతో పశువులకు మేత దొరకడం కరువైంది. అడవుల్లోకి తీసుకెళ్లడానికి దారి కూడా లేని పరిస్థితి. చేసేది లేక పాడి రైతులు క్రమంగా పశువులను విక్రయించడం ప్రారంభించారు. టీడీపీ నేతల పుణ్యమా అని ఆ గ్రామంలో ఒకటి రెండు తప్ప పశువులు లేవంటే అతిశయోక్తి లేదు.

మోసం చేశారు



మాకు ఒకటిన్నర ఎకరం పొలం ఇచ్చారు. నా మొగుడికి తాగించి మా పొలాన్ని రాసుకున్నారు. అప్పుడు కొంత, అప్పుడు కొంత డబ్బులు చేతిలోపెట్టి పాసుపుస్తకం కూడా లాక్కున్నారు. మమ్మల్ని మోసం చేశారు. ఆ పొలం ఇప్పుడు ఎకరం రూ.10 లక్షలట. మాకు న్యాయం చేయండి.

కృష్ణమ్మ, గంగలపూడి, ఎస్సీ కాలనీ

మా ఆయన రాసిచ్చాడంట



మాకు ప్రభుత్వం పొలం ఇచ్చింది. ఆ పొలం చదును చేసి పంట చేసుకునేవాళ్లం. కొన్నాళ్లకు మా ఆయన చని పోయాడు. మా పొలంలోకి వేరేవాళ్లు వచ్చారు. మా ఆయన వారికి పొలం రాసిచ్చారని బెదిరించారు. పాసుపుస్తకం నా వద్దే ఉంది. అయితే వారి కి రాసిచ్చారంటున్నారు. ఇదెక్కడి న్యాయం సారూ.

వెంకటమ్మ, గంగలపూడి ఎస్సీ కాలనీ

క్లుప్తంగా

సచివాలయ ఉద్యోగులకు రేపటి నుంచి పరీక్షలు



పరీక్షల నిర్వహణపై సూచనలు ఇస్తున్న డీఆర్వో పెంచల కిషోర్

తిరుపతి అర్బన్: సచివాలయ ఉద్యోగులకు కంప్యూటర్ పరిజ్ఞానంపై ఈ నెల 14, 15 తేదీల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్ తెలిపారు. సోమవారం ఆయన కలెక్టరేట్ కార్యాలయంలోని తమ చాంబర్‌లో ఏపీపీఎస్సీ అధికారులతో కలిసి పరీక్షల నిర్వాహణపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శ్రీనివా స మంగాపురం సమీపంలోని ఏఐఎం టెక్నా లజీ కేంద్రంలో రెండు రోజులపాటు సచివాలయ ఉద్యోగులకు పరీక్షలు ఉంటాయన్నారు. జిల్లా వ్యాప్తంగా 651 మంది ఉద్యోగులు హాజరుకానున్నట్టు ఆయన పేర్కొన్నారు.

పురుగుల మందు తాగి యువకుడి మృతి

సత్యవేడు: మండలంలోని కన్నావరం దళితవాడకు చెందిన అభిషేక్(19) పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సత్యవేడు పంచాయతీ పరిధిలోని సదవాలయ్మ ఆలయ సమీపంలో తెలుగుగంగ కాలువ పక్కన మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు కన్నావరం ఈశ్వరన్ కుమారుడుగా గుర్తించారు. నాగలాపురం మండలానికి చెందిన ఓ వివాహితతో అభిషేక్‌కు పరిచయం ఉండేది. ఆ మహిళను తరచూ ఫోన్‌లో వేధించేవాడు. దీంతో ఆమె నాగలాపురం పోలీస్ స్టేషన్‌లో అభిషేక్‌పై ఫిర్యాదు చేసింది. ఆ తర్వాత ఆమె భర్త కూడా అతన్ని బెదిరించడంతో మనస్తాపానికి గురైన అభిషేక్ పురుగుల మందుతాగి తనువు చాలించాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు వివాహిత భర్తపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు పుత్తూరు డీఎస్పీ వై.శ్రీనివాసరావు తెలిపారు.

నేడు చెవిరెడ్డి ఆధ్యాత్మిక పాదయాత్ర

- అమ్మవారికి పట్టువస్త్రాల సమర్పణ

తిరుపతి రూరల్: తిరుచానూరు శ్రీ పద్మావతీ అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో అత్యంత ప్రధాన్యమైన గజ వాహన సేవను పురస్కరించుకుని ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి కుటుంబ సమేతంగా పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. ఈ ప్రక్రియ దశాబ్ద కాలంగా ఆనవాయితీగా వస్తోంది. మంగళవారం వేకువజామున 5.30 గంటలకు తుమ్మలగుంట నుంచి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పట్టువస్త్రాలతో పాదయాత్రగా బయలుదేరనున్నారు. అంతకుముందు తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అక్కడి నుంచి గాం. దీపురం, అవిలాల, లింగేశ్వరనగర్, సాయినగర్, శ్రీనివాసపురం, పద్మావతీపురం మీదుగా తిరుచానూరుకు చేరుకోనున్నారు. దారిపొడవునా ఆయా గ్రామాలకు చెందిన భక్తులు ఆధ్యాత్మిక పాదయాత్రలో పాల్గొని చెవిరెడ్డితో కలిసి అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించనున్నారు.



పట్టువస్త్రాలతో ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దంపతులు (ఫైల్)

జర్నలిస్టులంతా మా కుటుంబ సభ్యులే

- తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి
- జర్నలిస్టులకు దీపావళి కానుక పంపిణీ

తిరుపతి: జర్నలిస్టులంతా తమ కుటుంబ సభ్యులుగానే భావిస్తామని తుడా చైర్మన్, చంద్రగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అన్నారు. తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని జర్నలిస్టులందరికీ ఆదివారం దీపావళి కానుకలను చెవిరెడ్డి మోహిత్ రెడ్డి స్వయంగా అందజేశారు. టపాసుల గిఫ్ట్ బాక్స్‌తో పాటు వాల్ క్లాక్‌ను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంక్రాంతి, దీపావళి పండుగలను తాము జర్నలిస్టులతో కలిసి ప్రతి ఏటా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. తన తండ్రి, ప్రభుత్వ విప్ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి జర్నలిస్టులతో ఎంతో అవినాభావ సంబంధం కలిగి ఉంటారని, ఆ సత్సంబంధాలను నిరంతరం కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ సంక్రాంతికి జగనన్న జర్నలిస్టులందరికీ సొంత ఇంటి స్థలం కలను సాకారం చేయనున్నారని చెప్పారు.



జర్నలిస్టులకు దీపావళి కానుకను అందజేస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

అగ్రికల్చర్‌లో తిరుపతి టాప్

- ఈ ఏడాదిలోనే ఐదు సార్లు తిరుపతి జిల్లా స్టేట్ ఫస్ట్

తిరుపతి అర్బన్: అగ్రికల్చర్ విభాగానికి సంబంధించి అందిస్తున్న సేవల్లో అక్టోబర్‌లోనూ తిరుపతి జిల్లా రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఉత్తమ వ్యవసాయ అధికారిగా ఎస్.ప్రసాద్‌రావును, ఉత్తమ అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా చంద్రగిరి మండలం, పెరుమాళ్లపాళెం సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్ కే.జ్యోత్స్నను ఎంపిక చేశారు. ఆమేరకు వ్యవసాయశాఖ కమిషనర్ సీహెచ్ హరికిరణ్ సోమవారం ఉత్తమ అధికారులు, ఉద్యోగుల వివరాలను ప్రకటించారు. ప్రతినెలా వ్యవసాయశాఖలో ఉత్తమ జిల్లాతోపాటు, ఉత్తమ అధికారుల పేర్లను రైతు భరోసా పుస్తకంలో ప్రచురించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాదిలో ఫిబ్రవరి, మార్చిలో తిరుపతి జిల్లా రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. అదేవిధంగా డీఏఓ ఎస్.ప్రసాద్‌రావును ఉత్తమ అధికారిగా ఎంపికచేశారు. తర్వాత ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్‌లోనూ వరుసగా తిరుపతి జిల్లానే రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలవడం విశేషం. ద్వితీయ స్థానంలో కాకినాడ, తృతీయ స్థానంలో చిత్తూరు, 26వ స్థానంలో అల్లూరి సీతారామరాజు జిల్లా నిలిచాయి.

ఈ క్రాప్ 100 శాతం పూర్తి

తిరుపతి జిల్లాలో పంట నమోదుకు సంబంధించి 100శాతం పూర్తిచేశారు. ఖరీఫ్‌లో 55,632 ఎకరాల్లో పంటసాగు చేయగా..55,632 ఎకరాల్లోని పంటను నమోదు చేశారు. అంతేకాకుండా విత్తనాలు, ఎరువులు తదితర 22 అంశాల్లో తిరుపతి జిల్లా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది 85శాతం నుంచి 100 శాతం ప్రగతి సాధించారు. దీంతో రాష్ట్రంలో తిరుపతి జిల్లా మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది.



జిల్లా వ్యవసాయ కార్యాలయం

హ్యాట్రిక్ సాధించాం



రాష్ట్రస్థాయిలో వరుసగా మూడుసార్లు తిరుపతి జిల్లా ప్రథమ స్థానంలో నిలవడం చిన్న విషయం కాదు. ఈ ఏడాదిలోనే ఐదు సార్లు తిరుపతి జిల్లానే ఫస్ట్. వ్యవసాయశాఖ ఇచ్చే ఆదేశాలను అగ్రికల్చల్ అధికారులు తప్పకుండా పాటిస్తున్నారు. ఇచ్చిన టార్గెట్ ప్రకారం 100శాతం పూర్తి చేస్తున్నాం. సమిష్టిగా పనిచేస్తున్న వ్యవసాయశాఖ అధికారులు, ఉద్యోగులకు అభినందనలు.

-ఎస్.ప్రసాద్‌రావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

శాస్త్రోక్తంగా కేదార గౌరీదేవి వ్రతం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం కేదారి గౌరీదేవి వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. తర్వాత అమ్మవారి ఎదుట కలశ స్థాపన చేసి కేదారి గౌరీదేవి వ్రతాన్ని నిర్వహించారు. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ సాగర్‌బాబు, పాలకమండలి సభ్యులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న వేదపండితులు

నేటి నుంచి కోటి బిల్వార్చన



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు , ఈవో సాగర్‌బాబు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో మంగళవారం నుంచి కోటి బిల్వార్చన– కోటి కుంకుమార్చన నిర్వహించనున్నారు. ఆలయ గురుదక్షిణామూర్తి సన్నిధిలో సోమవారం పోస్టర్లను ఆవిష్కరించారు. చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో సాగర్‌బాబు మాట్లాడుతూ 14వ తేదీ నుంచి డిసెంబర్ 12వ తేదీ వరకు కోటి బిల్వార్చన–కోటి కుంకుమార్చన జరుగుతుందన్నారు. మంగళవారం ఉదయం సంకల్పంతో పూజలు ప్రారంభమవుతాయని చెప్పారు.

బీటీఏ తిరుపతి జిల్లా నూతన కమిటీ ఏకగ్రీవం



ప్రతిజ్ఞ చేస్తున్న బీటీఏ జిల్లా నూతన కమిటీ

నాయుడుపేట: బహుజన టీచర్స్ అసోసియేషన్ తిరుపతి జిల్లా నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు అసోసియేషన్ నాయకులు వెల్లడించారు. పట్టణంలోని టంగుటూరు ప్రకాశం పంతులు పాఠశాలలో సోమవారం బహుజన టీచర్స్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశంలో తిరుపతి జిల్లా బీటీఏ జిల్లా అధ్యక్షులుగా టీ విశ్వనాథ్(పెనుమూరు), అసోసియేట్ అధ్యక్షులుగా డీ సిద్దయ్య(వెంకటగిరి), జిల్లా గౌరవ అధ్యక్షులుగా ఐ రమణయ్య(ఓజిలి), గౌరవ సలహాదారుగా వీ మాధవ(వాకాడు), వర్కింగ్ ప్రెసిడెంట్‌గా టీ రాజయ్య (వరదయ్యపాళెం), జిల్లా ప్రధాన కార్యదర్శిగా జె వెంకటరావు(నాయుడుపేట), జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరిగా కే రవి(చిట్టమూరు), కోశాధికారిగా పీ వెంకటయ్య (పాకాల), జిల్లా అడిట్ కమిటీ సెక్రటరిగా ఎన్ శివప్రసాద్(పాకాల), సీపీఎస్ కన్వీనర్‌గా రాజేంద్ర(కోట), జిల్లా మహిళ కార్యదర్శిగా పీ సుశీలమ్మ(నాయుడుపేట) , రాష్ట్ర, జిల్లా కౌన్సిలర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు వెల్లడించారు. బీటీఏ రాష్ట్ర నాయకులు పీ వేణుగోపాల్, పీ ఆది నారాయణ, పీ రామకృష్ణా పాల్గొన్నారు.

నేడు శోభాయాత్ర

చంద్రగిరి(తిరుచానూరు): శ్రీపద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా 5వ రోజు రాత్రి అమ్మవారు గజవాహనంపై తిరువీధుల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. పున్నమి గరుడ సేవ రోజున శ్రీవారికి అలంకరించే సహస్ర లక్ష్మీ కాసుల హారాన్ని గజవాహనం రోజున అమ్మవారికి అలంకరించడం పరిపాటి. ఇందులో భాగంగా మంగళవారం పల్లకీ ఉత్సవం అనంతరం సహస్ర లక్ష్మీకాసుల హారాన్ని తిరుమల నుంచి శోభాయాత్రగా తీసుకొచ్చి ఆలయ అధికారులకు అందజేయనున్నారు. రాత్రి గజవాహన సేవలో సహస్ర లక్ష్మీకాసుల హారంతో శ్రీవారి పట్టపురాణి అయిన శ్రీపద్మావతి అమ్మవారు మహాలక్ష్మిగా భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఇదిలావుండగా అమ్మవారికి ప్రీతిపాత్రమైన గజవాహనం రోజున వసంతోత్సవం(చందనోత్సవం) నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా మంగళవారం మధ్యాహ్నం 3.30 గంటలకు సన్నిధి ముఖమండపంలో అమ్మవారిని కొలువుదీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం తిరువీధుల్లో భక్తులపై చందనపు నీళ్లను చల్లుతూ అమ్మవారిని ఊరేగించనున్నారు

అమ్మవారికి పట్టు వస్త్రాల సమర్పణ

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల సందర్భంగా పద్మశాలీలు అమ్మవారికి చీర, పసుపు, కుంకుమ సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా ఆదివారం పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో పద్మశాలీలు ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి పట్టు వస్త్రాలను అందజేశారు. ఆలయ ఏఈవో రమేష్ పాల్గొన్నారు.



ఆలయ అధికారులకు పట్టువస్త్రాలను అందజేస్తున్న పద్మశాలీలు

పంచమి తీర్థానికి విస్తృత ఏర్పాట్లు

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల చివరి రోజైన నవంబర్ 18న పంచమి తీర్థానికి విశేషంగా భక్తులు విచ్చేసే అవకాశం ఉండడంతో విస్తృతంగా ఏర్పాట్లు చేపడుతున్నట్టు టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం తెలిపారు. తిరుచానూరులో పంచమి తీర్థం ఏర్పాట్లను ఆయన సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పుష్కరిణిలో గేట్లు, పంచమి తీర్థ మండపాన్ని, పద్మ సరోవరాన్ని పరిశీలించారు. భక్తులు ఇబ్బందులు పడకుండా పుష్కరిణిలోనికి ప్రవేశించేందుకు, తిరిగి బయటకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.



కార్తీక శోభ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక శోభ ఉట్టిపడుతోంది. ఆలయాన్ని ప్రత్యేకంగా విద్యుత్‌దీపాలతో అలంకరించారు. మొదటి రోజు సోమవారం రాత్రి సోమస్కంధమూర్తి, జ్ఞానప్రసూనాంబిక అమ్మవారు పురవీధుల్లో విహరిస్తూ కనువిందు చేశారు. కార్తీక మాసం సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను ఆలయ పాలక మండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు ప్రారంభించారు.

